



తొలకరి వర్షాలు పడుతున్నాయి. వానాకాలం సాగు షురూ అయింది. దీంతో నకిలీ విత్తన వ్యాపారులు కూడా రంగంలోకి దిగారు. రంగురంగుల ప్యాకెట్లలో నింపి వాటిని రైతులకు అంటగట్టే పనిలో పడ్డారు. ప్రతీ సంవత్సరం రైతులు వారి బారిన పడి మోసపోతూనే ఉన్నారు. వ్యవసాయ అధికారులు, పోలీసులు టాస్క్‌ఫోర్స్ బృందాలు వాటిపై ఇప్పటికే నజర్ పెట్టాయి. నిషేధిత, నకిలీ విత్తన వ్యాపారుల ఆటకట్టించేందుకు రంగంలోకి దిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయడంతో పాటు ఈ విత్తనాలపై రైతులకు అవగాహన కూడా కల్పించాయి.

నకిలీ విత్తనాలపై నజర్!



- వ్యవసాయ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు
- ఫర్టిలైజర్, విత్తన తయారీ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 7 : జిల్లాలో వానాకాలం సాగు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నకిలీ విత్తన వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4,45,428 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టడానికి జిల్లాలోని వ్యవసాయ డివిజన్లలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసు, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు పలు ప్రాంతాల్లో పర్యటించి సోదాలు చేస్తున్నారు. రోహిణి కార్తెలో రైతులు దుక్కులు దున్నడం వంటి పనులు చేస్తూ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా భావించి విక్రయదారులు నకిలీ, నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అధికారులు నకిలీలపై నజర్ పెట్టారు. జిల్లాలోని వివిధ మండలాలు, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల నిఘా

వానాకాలంలో చాలామంది రైతులు పత్తి, మొక్కజొన్న, వరి పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. ఇదే సమయంలో అనుమతి లేని విత్తనాలు, బీటీ-3 విత్తనాలు, నకిలీ విత్తనాలను వ్యాపారులు మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. నకిలీ విత్తనాల వల్ల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందంలో వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులు, సీడ్ సర్టిఫయింగ్ ఆఫీసర్ (ఎస్‌సీవో) ఉన్నారు. అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందుల స్టాకు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, విత్తనాల స్టాక్ జాబితాలను పరిశీలిస్తున్నారు. విత్తనాలు, ఫర్టిలైజర్ మందుల విక్రయానికి సంబంధించిన రశీదు పుస్తకాలను తనిఖీ చేస్తున్నారు. ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల కన్నుగప్పి నకిలీ విత్తనాలు అమాయక రైతులకు అంటగట్టేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. కొందుర్గు మండలం లూర్థునగర్‌లో ప్రభుత్వం నిషేధించిన 30 కిలోల బీటీ-3 పత్తి విత్తనాలను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్త..

నకిలీల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. లైసెన్సులు పొందిన డీలర్ల నుంచే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. డీలర్ల సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన తేదీ, విత్తనాల రకం, పరిమాణం, ధర, లాట్ నంబర్ తదితర వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయించుకుని సరిచూసుకోవాలని సలహా ఇస్తున్నారు. రంగు రంగుల ప్యాకెట్లను చూసి మోసపోవద్దని, కంపెనీ విశ్వసనీయత, విత్తనాల నాణ్యత, మొలక శాతం వివరాలను పరిశీలించుకోవాలని వివరిస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన తర్వాత ఖాళీ విత్తనాల సంచులను పంట చేతికొచ్చే చివరిదశ వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచిస్తున్నారు. సీజన్ ప్రారంభం అవుతుండడంతో కొందరు బిల్లులు లేకుండా తక్కువ ధరలకు విత్తనాలు అమ్ముతుంటారని, వారిపై వ్యవసాయ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని అధికారులు రైతులకు వివరిస్తున్నారు. విత్తన మార్కెట్‌ను పెంచడం, అధికంగా విత్తనాలు అమ్మకం కోసం వివిధ కంపెనీలు వ్యాపారులకు బహుమతులు, టూర్ల ఆఫర్లను ప్రకటిస్తుండడంతో పలువురు వ్యాపారులు, డీలర్లు నకిలీ వ్యాపారం వైపు మొగ్గుచూపే అవకాశాలుంటాయని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు వివరిస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు. కాలం చెల్లిన, ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, పురుగుల మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనేటప్పుడు దుకాణాల యజమానుల వద్ద నుంచి రశీదు తీసుకోవాలి. నకిలీ విత్తన విక్రయాలను అరికట్టడానికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి మోసపోవద్దు.

- గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ఐదేళ్లుగా పట్టుబడిన నకిలీ విత్తనాల వివరాలు

కేసులు	2019	2020	2021	2022	2023
కాటన్(లూజ్ సీడ్) క్వింటాళ్లు	1.67	63.00	80.20	50.70	12.50
కాటన్ (ప్యాకెట్లు)	00	1.078	869	00	00
ఇతర క్రాప్స్ క్వింటాళ్లు	00	4.80	13.455	00	0.8
మొత్తం విలువ(రూ.లక్షల్లో)	1.85	108.273	167.03	75.71	41.631
శాంపిళ్లు	01	14	40	15	00
ఐపీసీ కేసులు	01	07	14	04	03
6ఏ కేసులు	00	00	02	00	00
డెటెన్షన్	00	00	04	00	00
పీడీ ఆక్ట్	00	02	01	00	00
అరెస్టుల సంఖ్య	00	11	20	08	07



చేవెళ్లలో విత్తనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక


ఫర్టిలైజర్ దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు

నకిలీ విత్తనాలు అమ్మకంపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారు. ఇటీవలే ఆయన స్వయంగా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. లైసెన్సు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను తనిఖీ చేశారు. విత్తనాల ఎంపికపై తగు జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిలుకూరు ఆలయం మూసివేతపై తప్పుడు ప్రకటన

- శని, ఆదివారాల్లో దర్శనం ఉండదని గూగుల్‌లో పోస్టు
- గుర్తుతెలియని దుండగుల నిర్వాకం.. ఆలయ నిర్వాహకుల ఆగ్రహం
- తోసిపుచ్చిన ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జూన్ 7: సెర్చ్ ఇంజన్ గూగుల్‌లో చిలుకూరు బాలాజీ ఆలయానికి సంబంధించి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ఓ పోస్టు(ప్రకటన) పెట్టారు. అందులో ఇకనుంచి శని, ఆదివారాల్లో ఆలయాన్ని మూసివేస్తున్నారని, మిగతా రోజుల్లో ఆలయం తెరుచుకుని ఉంటుందని, దర్శన వేళల సమయాలను కూడా ప్రకటనలో పేర్కొనడం భక్తులను అయోమయానికి గురిచేసింది. దాంతో కొందరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ దృష్టికి విషయం తీసుకురాగా.. ఆయన శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ ఆలయ దర్శన వేళలు, ఆలయం మూసివేత, తెరిచి ఉండడంపై వివరాలు తాము వెల్లడిస్తామని, గూగుల్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాము ఎలాంటి ప్రకటనలు చేయకుండా సోషల్ మీడియాలో వివరాలు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శని, ఆదివారాల్లో చిలుకూరుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుంటారని, ఆలయం ప్రతిష్ఠతను కొందరు దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. కలియుగ దైవం చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రతిష్ఠతను కొందరు దుర్మార్గులు దెబ్బతీయాలని చూస్తున్నారని, అలాంటి వారికి వేంకటేశ్వరస్వామి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని రంగరాజన్ మండిపడ్డారు. గూగుల్‌లో పెట్టిన వివరాలు అబద్ధమని, ప్రజలు నమ్మవద్దని ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకుడు రంగరాజన్ చెప్పారు.



చిలుకూరు ఆలయం దర్శన వేళల గురించి గూగుల్‌లో చేసిన పోస్టు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. జూన్-9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు 93 కేంద్రాల్లో 55,692మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, రీజనల్ కోఆర్డినేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు పరీక్ష నిర్వహణలో తమకు కేటాయించిన విధులు పూర్తి బాధ్యతతో నిర్వహించాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను ఉదయం 9గంటల నుండి 10 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని, తరువాత అనుమతి ఉండదని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని తెలిపారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు ప్రతిమాసింగ్ తెలిపారు. కార్యక్రమంలో టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ గిరిధర్, సైబరాబాద్ ఏసీపీ మురళీకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇక పాలనపై దృష్టి

- ముగిసిన ఎన్నికల కోడ్
- సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారుల శ్రద్ధ
- వేగవంతం కానున్న పనులు
- ప్రత్యేక ప్రణాళికతోనే సమస్యల పరిష్కారం

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/వికారాబాద్/తాండూరు, జూన్ 7 : కొన్ని నెలలుగా కొనసాగిన ఎన్నికల కోడ్ ముగిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సుదీర్ఘంగా 81రోజుల పాటు కోడ్ అమల్లో ఉంది. గత బుధవారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ ముగిసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రెండున్నర నెలలకుపైగా స్తంభించిన సాధారణ పాలన పట్టాలెక్కింది. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికార యంత్రాగం వారి విధుల్లో చేరారు. రెవెన్యూ, పురపాలక, పోలీసు శాఖల్లో పనులు స్తంభించాయి. కోడ్ ఉన్న సమయాల్లో అత్యవసరమైతే తప్ప ఇతర పనులు చేయలేని పరిస్థితి ఉండేది. లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16న ఎన్నికల షెడ్యుల్ విడుదలైనప్పటి నుంచి జూన్ 4న ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంది. ఇప్పుడది తొలగిపోవడంతో ఎమ్మెల్యేలు, అధికారులు సాధారణ పాలన కొనసాగించనున్నారు. ఎప్పటిలాగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిపెట్టనున్నారు. గతంలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి ఎమ్మెల్యేకు రూ.10కోట్ల చొప్పున కేటాయించారు. ఇందులో రూ.కోటి తాగునీటి ఎద్దడి నివారణకు వెచ్చించాలని మార్చిలోనే అధికారులను ఆదేశించారు. మిగిలిన నిధులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులకు వినియోగించాల్సి ఉంది. కాగా మార్చి 16న ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు నిలిచాయి. ఇకపై ఈ పనులపై ఎక్కువ దృష్టిసారించే అవకాశం ఉంది.



పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజావాణి మళ్లా షురూ!

కలెక్టర్లు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జూన్ 4 వరకు నిలిపేశారు. వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు విన్నవించే వారు. ఎన్నికల కోడ్‌తో సమస్యలు పేరుకుపోయాయి. జూన్‌లోనే సాగు ప్రణాళిక, వసతుల కల్పన, రోడ్లు, ప్రజారోగ్యం తదితర కీలకాంశాలపై అధికారులు, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశాలు నిర్వహించే వారు. కోడ్‌తో వాటికి బ్రేక్ పడినా ఇకపై ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు. ప్రజావాణి వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో వివిధ శాఖల అధికారులు అందుబాటులోకి రానున్నారు.

స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు

పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు నిలిచాయి. ఇందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు ఇప్పుడు కొనసాగే అవకాశాలున్నాయి. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు. అధికారులు సైతం మూడు నెలలుగా ఎన్నికల విధుల్లోనే ఉండటంతో పనులు నిలిచాయి. పారిశుధ్య పనులు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, డ్రెయిన్లు, రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించి పనులు ఉధృతంగా చేయించాల్సి ఉంది.

నత్తనడకన 'అమ్మ ఆదర్శ' పాఠశాలల పనులు

జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానుండగా ప్రభుత్వ బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. జూన్ 10లోగా పనులు పూర్తిచేయాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌లకు ఆదేశాలిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, పనులు పూర్తయిన పాఠశాలలకు రంగులువేయలని, పనులు మొదలుపెట్టని చోట్ల వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అధికారులు చొరవ చూపితే జూన్ 12లోగా 50శాతం పనులు పూర్తియ్యే అవకాశం ఉంది.

పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం

ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కోడ్‌తో దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ముందుకు సాగలేదు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లోనే లీనం కావడంతో ప్రక్రియ దరఖాస్తుల స్థాయిలోనే నిలిచింది. ప్రభుత్వం ప్రస్తుతం ధరణిలోని పలు నిబంధనలను సవరిస్తోంది. జీఎల్‌ఎం ద్వారా వచ్చిన దరఖాస్తులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగితేనే పెండింగ్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

తొలకరి పలకరింపు!

- జిల్లాలో అక్కడక్కడా వర్షాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పిడుగుపాటుకు పాడి ఆవులు, మేకలు మృతి
- షాద్‌నగర్‌లో షాపులు, ఇళ్లలోకి చేరిన వరద నీరు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/ కొందుర్గు/చౌదరిగూడ/కేశంపేట/నందిగామ, జూన్ 7: జిల్లాలో తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అక్కడక్కడా పిడుగులు పడడంతో పాడి ఆవులు, మేకలు మృత్యువాత పడ్డాయి. తొలకరి వర్షాలతో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. రోడ్లపై వరద ప్రవాహం కొనసాగింది. లోతట్టు ప్రాంతాల్లోని షాపులు, ఇండ్లలోకి వరద నీరు చేరింది. గాంధీనగర్ కాలనీలో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. 22వ వార్డులోని భగత్‌సింగ్ కాలనీ, పటేల్ రోడ్డులోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. సీఎస్‌కే విల్లాస్‌లోని ఇళ్లలోకి సైతం వరదనీరు తాకింది. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో పర్యటించారు. ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గంట పాటు ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొందుర్గు మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు వర్షం కురువడంతో వాతావరణం చల్లబడింది. జిల్లేడ్ చౌదరిగూడ శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. యాచారం మండలంలో కుండపోత వర్షం కురిసింది శుక్రవారం అలాగే రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్‌లో 47.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తలకొండపల్లిలో 36.5 మిల్లీమీటర్లు, నందిగామలో 35.5 మిల్లీమీటర్లు, మహేశ్వరంలో 28.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



షాద్‌నగర్‌లో షాపుల్లోకి చేరిన వరద నీరు

పిడుగుపాటుకు పాడిఆవులు, మేకలు మృతి

జిల్లాలో పిడుగుపాటుకు పాడి ఆవులు, మేకలు మృతి చెందాయి. ఆమనగల్లు మండలం గౌరారానికి చెందిన నిట్ట పర్వతాలు వ్యవసాయ పొలం వద్ద ఆవులను మేపుతున్నాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఆవులను చెట్టుకిందకు తోలాడు. పిడుగు చెట్టుపై పడడంతో చెట్టుకింద ఉన్న రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. కేశంపేట మండలం సంగెంలో పట్లోని గూడెం కిష్టయ్యకు చెందిన పాడి ఆవును వ్యవసాయం పొలంలో చెట్టుకు కట్టివేశాడు. ఆ సమయంలో అక్కడ పిడుగు పడింది. దీంతో ఆవు చనిపోయింది. నందిగామ మండలం దేవుని మామిడిపల్లిలో పిడుగుపాటుకు బొద్ద శంకరయ్య యాదవ్‌కు చెందిన 10 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. వర్షానికి ఇవి చెట్టు కిందకు చేరడంతో పిడుగు పడి మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



ఆమనగల్లు : గౌరారంలో పిడుగు పడి మృతిచెందిన ఆవులు

భూ వివాదాన్ని పరిష్కరించడం లేదని.. ఒంటిపై డీజిల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం

- యాచారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన
- వారించిన పోలీసులు.. న్యాయం చేస్తామని హామీ

యాచారం, జూన్ 7 : భూ వివాదం పరిష్కరించడం లేదని, పోలీసులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం చేయడంలేదని ఓ గిరిజన రైతు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాను చస్తేనే భూ సమస్యను పట్టించుకుంటారా? అని రోధిస్తూ రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. బాధితుడు, అతడి భార్య, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన బిక్కు-జ్యోతి దంపతులకు తాత ముత్తాతల కాలం నుంచి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 71, 72 లలో 4 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అందులో వారు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిపై తనకు అన్ని హక్కులున్నాయని గ్రామానికి చెందిన బిక్కు దంపతులు తెలిపారు. అయితే, భూమి చుట్టూ బిల్ల అనే రైతు ఆ భూమి తనదంటూ ఇటీవల కడీలు పాతాడని వారు ఆరోపించారు. గురువారం వాటిని బిక్కు దంపతులు తొలగించడంతో ఆగ్రహంతో శుక్రవారం బిక్కు-జ్యోతి దంపతులపై బిల్ల వర్గీయులు దాడి చేశారు. ఈక్రమంలో తన మంగళసూత్రం పొగొట్టుకున్నట్లు బిక్కు భార్య జ్యోతి పోలీసులకు వివరించింది. తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆందోళన చెందారు. తమకు న్యాయం జరగదని పోలీస్‌స్టేషన్ ఎదుట బిక్కు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా.. పోలీసులు నిలువరించి అతడిని స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. ఆత్మహత్య చేసుకుంటే సమస్య పరిష్కారమవ్వదని పోలీసులు బిక్కుకు హితబోధ చేశారు. ఈమేరకు అతడికి కౌన్సిలింగ్ ఇచ్చారు. విచారణ జరిపించి తగిన న్యాయం చేస్తామని ఎస్సైలు వెంకట నారాయణ, గోపాల్‌లు బాధితులకు సూచించారు. బిల్ల వర్గీయులతో తమకు ప్రాణహాని ఉందని ఆ దంపతులు రోధించారు. బిక్కు ఒంటిపై డీజిల్ పోసుకోవడంతో స్టేషన్‌లో కలకలం రేగింది. బిక్కు కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు గిరిజనులు పోలీసులను కోరారు. సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేస్తామని ఎస్సైలు చెప్పారు. ఇరువర్గాలతో మాట్లాడి తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. ఈ ఘటనపై రెవెన్యూ రికార్డులు పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.



ఆత్మహత్యాయత్నానికి యత్నించిన రైతును అడ్డుకుంటున్న పోలీసులు

గ్రూప్ 1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరగాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, జూన్ 7: గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జూన్ 9వ తేదీన నిర్వహించే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలపై ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావునీయకుండా అతిజాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రూట్ అధికారులు తమ లొకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి హాల్‌టికెట్, ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేష్ ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యాలు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 105 కేంద్రాల్లో 69,727 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. 105 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, జాయింట్ కస్టోడియన్ ఆఫీసర్స్ 7, స్ట్రాంగ్ రూమ్స్ 7, రూట్స్ 18, రూటు ఆఫీసర్స్ 18 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 22 మంది, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్ 276మంది, అబ్జర్వర్స్ 105 మందిని నియమించినట్లు తెలిపారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144సెక్షన్ అమలు చేయాలని, అభ్యర్థులను విడివిడిగా తనిఖీ చేయాలన్నారు. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు అనుమతి ఉంటుందని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్‌లో ఏర్పాట్లు పూర్తి

ఘట్‌కేసర్ రూరల్: ఈ నెల 9న జరిగే గ్రూప్-1 పరీక్షలకు సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఘట్‌కేసర్ తహసీల్దారు డీఎస్ రజిని తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ మండలంలోని 13కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13 కేంద్రాల్లో 9,878 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కొండాపూర్‌లోని విజ్ఞాన మహిళా ఇంజనీరింగ్ కళాశాల, అవుశాపూర్‌లోని అరోరా, విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలు, ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగ్ కళాశాల, అంకుశాపూర్‌లోని ఏస్ ఇంజనీరింగ్ కళాశాల, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలోని రెండు కేంద్రాలు, కొర్రెములలోని సిద్ధార్థ కళాశాల, చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్' శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి



వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి ఉపేందర్

వికారాబాద్, జూన్ 7: అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కె.ఉపేందర్ తెలిపారు. 2024-25 సంవత్సరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందడానికి జిల్లాకు చెందిన గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకుని బీసీ కులాలకు చెందిన అభ్యర్థులు జూన్ 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో నలుగురు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రాష్ట్ర చట్టం కింద స్థాపించడిన విశ్వవిద్యాలయం లేదా కేంద్ర విద్యాలయం గ్రాంట్స్ కమిషన్ గుర్తించి విద్యాసంస్థల నుంచి లా డిగ్రీ పొంది ఉండాలని సూచించారు. అభ్యర్థి వయసు జూలై 22 నాటికి 23 సంవత్సరాల నుంచి 35సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల, సంరక్షకుల ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలకు మించి ఉండరాదన్నారు. అభ్యర్థులుగతంలో ఇలాంటి సౌకర్యాన్ని వినియోగించుకొని ఉండరాదని, బార్ కౌన్సిల్ తమ పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మూడేళ్ల అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందాలన్నారు. ఈ మూడేళ్లు ఆర్థిక సాయం అందించబడుతుందని తెలిపారు. శిక్షణా కాలంలో రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనం చెల్లించబడుతుందని తెలిపారు. అడ్వకేట్‌గా నమోదు చేసుకునేందుకు రూ.55 రుసుము చెల్లించబడుతుందని తెలిపారు. పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలుకు రూ.3వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణకు జిల్లా న్యాయస్థానంలోని ప్రభుత్వ న్యాయాధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుబంధం చేయబడుతుందని తెలిపారు. జూన్ 10 నుంచి జిల్లా వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలోదరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పాస్‌పోర్ట్ సైజ్‌లో ఆధార్, స్థానిక కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, లాడిగ్రీ ప్రొవిజినల్‌తో పాటు కౌన్సిల్ కన్సాలిడేట్ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 5వ తేదీలోగా వికారాబాద్ కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూన్ 7: 'గిరిజనులకు తాగు నీటి కష్టాలు' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాగం కదిలింది. మండలంలోని మాసన్‌పల్లి పంచాయతీ అనుబంధ గ్రామమైన తౌర్యానాయక్ తండాను డీఎల్‌పీవో శంకర్ నాయక్, బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు, మిషన్ భగీరథ డీఈ, పంచాయతీ కార్యదర్శి తండాను సందర్శించారు. చేతిపంపులు, పైపులైన్ల మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. యుద్ధ ప్రతిపాదికన చేతి పంపుల మరమ్మతులను చేపట్టారు. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో శంకర్ నాయక్, ఎంపీడీవో రాఘవులు ఆంధ్రజ్యోతికి వివరించారు.



పనులను పర్యవేక్షిస్తున్న తాండూరు డీఎల్‌పీవో శంకర్ నాయక్













పూజలందుకున్న కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనుల పండువగా ఎల్లమ్మ రథోత్సవం

- బోనమెత్తిన మహిళలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

తాండూరు రూరల్, జూన్ 7 : తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర రథోత్సవం కనుల పండువగా సాగింది. రథోత్సవంలో భాగంగా కొత్లాపూర్‌లోని నవీన్‌రెడ్డి ఇంటి నుంచి అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం ప్రాంగణంలో సిడేతో పాటు రథంలో అమ్మవారిని ప్రతిష్ఠించగా, భక్తులు, యువకులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఈవో శేఖర్‌గౌడ్, నాయకులు పలువురు సన్మానించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా, రథోత్సవం సమయంలో భారీ వర్షం కురియడంతో భక్తులు రథాన్ని వానలోనే లాగారు. రథోత్సవం చూసేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, నాగప్ప, బుడ్డెళ్లి సాయిలు, ఎంపీటీసీ రాజ్‌కుమార్, సందీప్‌రెడ్డి, జైదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గోపాల్, సురేష్, రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉత్తంచంద్, డాక్టర్ సంపత్‌కుమార్, బసిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు

పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటా

- నమ్మకంతో ఓట్లేసిన ప్రజలకు, పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు
- ఫీనిక్స్ పక్షిలా పైకి లేద్దాం
- చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



వికారాబాద్/చేవెళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తాను ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటానని మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఓ ప్రతికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రతీ ఒక్క ఓటరుకు, తన కోసం అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవ ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమించామని తెలిపారు. అయితే ఎన్నికల ఫలితం మాత్రం తమ అంచనాలకు భిన్నంగా వచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తన కోసం పనిచేసిన కార్యకర్తలందరికీ తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల పాటు సాగిన ఎన్నికల పోరాటంలో చేవెళ్ల ప్రజలు ఇచ్చిన తీర్పును తాను నిండు మనస్సుతో గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే అభివృద్ధి, అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో భాగమవడమే కాకుండా ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, తన శ్రేయోభిలాషులు ఎవరూ చింతించాల్సిన పనిలేదని, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేయాలని ఆయన గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఫీనిక్స్ పక్షి మాదిరి కింద నుంచి పైకి వస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే, కొన్ని వ్యక్తిగత పనుల కోసం తాను వారం రోజుల పాటు అందుబాటులో ఉండడం లేదని, వారం రోజుల తరువాత ప్రజాసేవలో నిమగ్నమవుతానని ఆయన తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, జూన్ 7 : కాలుష్యం పెరిగిపోతుండటంతో భూతాపం పెరిగి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రోజురోజుకూ అడవులు అంతరించపోవడంతో పర్యావరణానికి తీరని ముప్పు కల్గుతుందన్నారు. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి ప్రాణవాయువు తగ్గిపోతోందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుంచి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 24వ తేదిన మండల పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ చామంతి శివరాజ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బక్కరెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, నరేందర్‌గౌడ్, ఇంద్రసేనవారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రమేశ్, జబ్బార్, నర్సింలు, మోసిన్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో కురుస్తున్న వర్షం

మోస్తరు నుంచి భారీ వర్షం

- తాండూరు ఏఆర్ఎస్ ప్రాంతంలో 48.8 మిల్లీమీటర్లు నమోదు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

వికారాబాద్/పరిగి/తాండూరు/కొడంగల్ / బొంరాస్‌పేట్, జూన్7 : వికారాబాద్ జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా తాండూరు ఏఆర్ఎస్ ప్రాంతంలో 48.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా బషీరాబాద్‌లో 42.3 మిల్లీమీటర్లు నమోదైంది. కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద ప్రవహించింది. గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పరిగి సబ్ డివిజన్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షంతో చెట్లు విరిగిపడ్డాయి. పరిగితో పాటు, పలు గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అధిక ధరకు పత్తి విత్తనాలు విక్రయం

- షాపు యజమానిపై కేసు నమోదు

చేవెళ్ల, జూన్ 7: అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపు యాజమానిపై చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి చౌరస్తాలో ఉన్న శ్రీసాయి ఏజెన్సీ ఫర్టిలైజర్ దుకాణదారు ఈగ లక్ష్మారెడ్డి పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.860కు బదులు.. అధిక ధర రూ.1200కు అమ్ముతున్నట్లు చేవెళ్ల ఏవో తులసికి సమాచారం అందింది. దాంతో ఆమె విచారణ చేయగా.. రైతులకు అధిక ధరకు విత్తనాలు అమ్మినట్లు తెలిసింది. ఈమేరకు ఏవో చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా దాదాపు 120 పత్తి విత్తన ప్యాకెట్లు అధిక ధరకు రైతులకు అమ్మినట్లు బిల్లులతో పాటు ఆధారాలు లభించాయి. దాంతో షాపు యాజమాని ఈగ లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అధిక ధరకు విత్తనాలు, ఎరువులు, మందులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు జరపాలని సూచించారు. నిబంధనలు ఉల్లఘిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాల ప్యాకెట్లు



హోటల్‌పై చినిగిపోయి ప్రమాదకరంగా వేళాడుతున్న బ్యానర్

చిరగిన బ్యానర్.. ప్రమాదానికి నిలువుటద్దం

మొయినాబాద్ రూరల్, జూన్ 7: ఇటీవల ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన భవనాలపై ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిరిగిపోయి మృత్యుపాశాలుగా వేలాడుతున్నాయి. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఉడిపి హోటల్ భవనంపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ చిరిగి వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ప్రయాణించే వాహనాదారులపై పడి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఇటీవల కాలంలో అనుమతులు లేకుండా రోడ్డు పక్కనే ఉన్న భవనాలపై ప్రమాదకరంగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారని ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయని.. వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. హిమాయత్ నగర్ గ్రామంలోని వైన్స్ దుకాణం ముందు ఓ ఇంటిపై భారీ ఎత్తు హోర్డింగ్ ఏర్పాటు చేస్తున్నారని దానివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ గ్రామ ప్రజలతో పాటు ఇటువైపు ప్రయాణించే వాహనాదారులు కోరుతున్నారు.



కొర్రమీనుకు భలే డిమాండ్

- కిలో రూ. 600 పలికిన ధర

వికారాబాద్, జూన్ 7 : మృగశిర కార్తె పురస్కరించుకుని వికారాబాద్ మార్కెట్‌లో చేపలు విక్రయాలు జోరందుకున్నాయి. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టుల నుంచి వచ్చిన చేపలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. రవ్వ, బొచ్చ చేపలు కిలో రూ.160 పలకగా, కొర్రమీను రూ. 600లకు విక్రయించారు. శనివారం మృగశిర కార్తె కావడంతో ఆరోజు చేపలు తప్పకుండా తినాలనే అనవాయితీలో భాగంగా శుక్రవారమే ప్రజలు చేపలు కొనుగోలు చేశారు.



వికారాబాద్ మార్కెట్‌లోఅమ్మకానికి వచ్చిన చేపలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో విజయలక్ష్మి

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

కేశంపేట, జూన్ 7: ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం తగదని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో విజయలక్ష్మి సూచించారు. ఈనెల 6న సాయంత్రం ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగడంతో కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకరాగా.. వైద్య సిబ్బంది లేక పోవడంతో షాద్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అయితే, ఈ విషయం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోకు బాధితులు ఫిర్యాదు చేశారు. దాంతో శుక్రవారం కేశంపేట పీహెచ్‌సీలో విచారణ చేశారు. వైద్యసేవలు సకాలంలో అందకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు మారే సమయంలో ఒకరు వచ్చిన తరువాతనే మరొకరు వెళ్లాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆమె గ్రామస్తులతో మాట్లాడారు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, శివాజీలు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 7: ప్రభుత్వ డైట్, ప్రైవేట్ డీఈఎల్‌ఈడీ కళాశాలలో ప్రవేశాలకు జూన్ 6వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ డైట్ ప్రిన్సిపల్ కె.రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 రెండు సంవత్సరాల డీఈఎల్ కోర్సు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మీడియంలో చేరడానికి ఆన్‌లైనులో అప్లికేషన్లు సమర్పించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కంప్యూటర్ బెస్డ్(ఆన్‌లైన్ మోడ్) ద్వారా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో ఓసీ, బీసీ అభ్యర్థులు 50శాతం మార్కులతో, అదేవిధంగా ఎస్సీ ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 45శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలను హెచ్‌హెచ్‌టీపీ:డీఈఈసీఈటీ.సీడీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని డైట్ ప్రిన్సిపల్ తెలిపారు.

పార్లమెంటులో సమస్యలపై గళం విప్పుతా

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల, జూన్ 7 : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై పార్లమెంటులో గళం విప్పుతానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి బుగ్గరాములు తదితరులు శుక్రవారం కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కావలి శ్రీనివాస్, చీమల జంగయ్యయాదవ్, రమాకాంత్‌రెడ్డి, పెర్కమూర్తి, ఆనంగళ్ల యాదయ్య, మాసయ్యగౌడ్, రావుల బాషా, సాతిరి ఎల్లేష్, మార సురేష్, చిందం ఐలయ్య, రాజేష్, మార లక్ష్మన్, ముద్దం శంకర్, ప్రవీణ్‌గౌడ్, సూర్యం, పెంటయ్య, లక్ష్మన్, రిజిని అంతటి కృష్ణ తదితరులు ఉన్నారు.



యాచారంలో దుకాణం తనిఖీ చేస్తున్న గీతారెడ్డి

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లాలో ఎరువులు విత్తనాల కొరత లేదు
- వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ గీతా రెడ్డి

యాచారం, జూన్ 7 : నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మినా.. లూజుగా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ గీతారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆమె యాచారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు విత్తనాలు లూజుగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు కొన్న రైతులు రసీదులు తీసుకోవాలని, వాటిని పంట చేతికందే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ అనుమతి లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలం చెల్లిన విత్తనాలు అమ్మరాదని కోరారు. పదిమందికి అన్నం పెడుతున్న రైతుకు అన్యాయం చేయరాదని వ్యాపారులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ముగిసేదాకా ప్రతీ మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేయాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

విత్తనాల కొరత సృష్టించొద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో అరుణకుమారి

ఆమనగల్లు, జూన్ 7: విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి అన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం అరుణకుమారి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల రికార్డులు, విత్తన, ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి విధిగా రశీదులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని అరుణకుమారి సూచించారు. స్టాక్‌బోర్డును ప్రతీ రోజు అప్‌డేట్ చేయాలని తెలిపారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు చంద్రశేఖర్, రవి, చంద్రమౌళి, మధు, రాజు తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలి

- 'బడిబాట'లో అధికారులు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం, జూన్ 7: బడీడు ఉన్న ప్రతి ఒక్కరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ తల్లిదండ్రులను కోరారు. ప్రో.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు మండల పరిధిలోని చెర్లపటేల్‌గూడ గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాల విద్యార్థుల యూనిఫాం స్టిచింగ్ సెంటర్‌ను పరిశీలించారు. నిర్ణీత సమయంలోగా యూనిఫాం అందించాలని మహిళలను కోరారు. కర్ణంగూడలో నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో క్రాంతికిరణ్, మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీటీసీ అంజనేయులు, గ్రామ ప్రత్యేకాధికారి జి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని ఎంఈవో సర్దార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇర్విన్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో కోరారు

ఆమనగల్లు : బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. మున్సిపాలిటీలోని నుచ్చుగుట్ట తండాలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి తండాలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్య ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపి చక్కటి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మీకృష్ణనాయక్, ఉపాధ్యాయురాలు శివలీల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

యాచారం : ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన చేస్తున్నామని, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నామని, రెండు జతల దుస్తులిస్తున్నామని, పౌష్టికాహారం అందిస్తున్నామని, మీ పిల్లలను బడివకి పంపండి నిజ కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇల్లిల్లూ తిరిగి తల్లిదండ్రులను కోరారు. ఈమేరకు బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమం కుర్మిద్ద, తాటిపర్తి తదితర గ్రామాల్లో నిర్వహించారు.



మాడ్గుల : ఇర్విన్ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో సర్దార్, విద్యార్థులు



ఇబ్రహీంపట్నం : చెర్లపటేల్‌గూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆమనగల్లు : నుచ్చుగుట్ట తండాలో ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆ యా గ్రామాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రతీ బడిలో అన్నిరకాల వసతులు కల్పించడం జరుగుతుందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు.

చౌదరిగూడ : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య బోధించబడుతుందని మండల ఇన్‌చార్జి ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో రెండవ రోజు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వామే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను పంపిణీ చేస్తుందన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, చౌదరిగూడ ఇన్‌చార్జ్ హెచ్ఎం విల్సన్ సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యాచారం : చింతపట్లలో పిల్లల వివరాలు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు



చౌదరిగూడ : ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు

ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహించొద్దు



వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, ఆశా వర్కర్లు

కందుకూరు, జూన్ 7: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు నిర్వహించే పరీక్షను వెంటనే రద్దు చేయాలని, 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆశావర్కర్లతో కలిసి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో, 19 సంవత్సరాలుగా పట్టణ ప్రాంతాల్లో అనేక రకాలుగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల పేరుతో కాలయాపన చేయకుండా పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆశావర్కర్లకు పరీక్ష నిర్వహించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులు కానివారికి తీరని అన్యాయం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ.15వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లు జయసుధ, ముంతాజ్, ప్రేమలత, అనిత, సురేఖ, భాగ్య, లక్ష్మమ్మ, తదితరులున్నారు.

ప్లాట్ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బేగంపేట గ్రామస్తులు

కందుకూరు, జూన్ 7: తమ ప్లాట్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బేగంపేట గ్రామస్తులు శుక్రవారం కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలు గ్రామ కంఠంభూమిలో ఎకరం భూమిలో ప్లాట్లు చేసుకొని 60 ఏళ్లుగా పశువుల పాకలువేసి జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈక్రమంలో ఇటీవల అదే గ్రామానికి చెందిన అండేకార్ ఆనంద్ ఆ భూమి తనదంటూ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి దాడులు చేయడానికి కుట్రలు పన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మా తాతలు, తండ్రుల నాటి నుంచి ఆ భూమిలో తామే జీవనం సాగిస్తున్నామని, తమ ప్లాట్లను ఆక్రమించడానికి కుట్రలు పన్నిన అండేకార్ ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కంద పెద్ద నర్సింహ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బొడ్రాయి బోనాలు

షాబాద్, జూన్ 7 : మండల కేంద్రంలో బొడ్రాయి మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం డప్పుదరువులతో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాలతో బొడ్రాయి వద్దకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు పండేలా చూడాలని గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో బొడ్రాయి వద్దకు బయలుదేరిన గ్రామస్థులు

తెలంగాణ రాజముద్రలో మార్పులు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అమరేందర్

కందుకూరు, జూన్ 7: రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రలో మార్పులు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, ఈమేరకు ధర్మ సమాజ్ పార్టీ తరపున కొత్తగా కొన్ని ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని మార్పులు చేపట్టాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ జి.అమరేందర్ కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ కె.గోపాల్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజముద్రలో అమరవీరుల చిహ్నం మాత్రమే పొందుపరుస్తుందని, అంబేడ్కర్, పండుగ సాయన్న, సర్దార్ పాపన్నగౌడ్, సమ్మక్క సారళమ్మ, ఉస్మానియా వర్సిటీ, అశోక చక్రం చిహ్నాలను పొందుపర్చాలని డిమాండ్ చేశారు. మండల కో-కన్వీనర్ గూడూరు భాస్కర్, నాయకులు మహిపాల్, ఎర్ర ప్రవీణ్, ఊటు లక్ష్మయ్య, చిన్నగళ్ల అంజయ్య తదితరులున్నారు.

ఆత్మవిశ్వాసం విజయానికి సోపానం



దుర్గను సన్మానిస్తున్న రామ్మోహన్, నాయకులు



దీపిక



రిషిత

ఆమనగల్లు, జూన్ 7: చదువులో ప్రతిభతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీర బొమ్మ రామ్మోహన్ అన్నారు. ఆత్మవిశ్వాసం విజయానికి సోపానమని ఆయన అన్నారు. నీట్-2024 ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు గాను 637 మార్కులు సాధించిన ఆమనగల్లు పట్టణానికి చెందిన పాపిశెట్టి అరవింద్-కళ్యాణి దంపతుల కుమార్తె దుర్గకు శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించారు. దుర్గను ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్కరించి అభినందించారు. వాసవి ఎడ్యుకేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దటూరు విద్యార్థినికి 696 మార్కులు

శంకర్‌పల్లి : ప్రొద్దటూరు గ్రామానికి చెందిన గండిచెర్ల దీపిక నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. నీట్ పరీక్షా ఫలితాల్లో దీపిక 720 మార్కులకు గాను 696 మార్కులు సాధించింది. జాతీయ స్థాయి ర్యాంకు 2672 (99.88 పర్సంటైల్) వచ్చింది. కూతుకు దీపిక ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల తల్లిదండ్రులు గండిచెర్ల మాధవి, గోవర్ధన్ రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. ఎయిమ్స్ కళాశాలలోనే తమ కూతురికి సీటు వస్తుందని ఆనందం వ్యక్తంచేశారు.

చిలుకూరు విద్యార్థినికి 625 మార్కులు

మొయినాబాద్ : నీట్ పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని దర్గ రిషిత ప్రతిభ చాటింది. గ్రామానికి చెందిన దర్గ వందన, నరేందర్ దంపతుల కూతురు రిషిత ఇటీవల విడుదలైన ఫలితాల్లో 720 మార్కులకు 625 మార్కులు సాధించి తన ప్రతిభను చాటింది. రిషితను గ్రామంలోని పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

షాద్‌నగర్ అర్బన్/కేశంపేట, జూన్ 7: ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో జడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీష్ అహ్మద్‌లు పాఠశాలల ప్రధానోపాధ్యాకులను పుస్తకాలను అందించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఇవ్వాల్సిన పుస్తకాల్లో 50శాతం వచ్చాయని, వాటిని పంపిణీ చేశామని ఎంఈవో శంకర్ రాథోడ్ తెలిపారు. కేశంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు.

రాములు మరణం తీరని లోటు

యాచారం, జూన్ 7: మండల సొసైటీ అటెండర్ రాములు మరణం తీరని లోటు అని చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించాడు. సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, సీఈవో నాగరాజుతో పాటు సొసైటీ డైరెక్టర్లు సంతాపం తెలిపారు. రాములు మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. సొసైటీ తరపున కుటుంబ సభ్యులకు రూ.15వేల అందించారు.

వాడీవేడిగా మండల సమావేశం

యాచారం, జూన్ 7 : వెంచర్ నిర్వాహకులు అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తారని, రైతులగోడు ఎందుకు పట్టదని మండల సర్వసభ్య సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ తీరుపై ఎంపీపీ సుకన్యబాషా, వైస్‌ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, మీకు స్వయంగా ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఏఈని ఎండగట్టారు. చాలాచోట్ల ఇనుప స్తంభాలు తొలగించలేదని ఎంపీపీ నిలదీశారు. మేడిపల్లిలో వివాదంలో ఉన్న భూమికి మీటర్లు ఎలా ఇచ్చారని వైస్ ఎంపీపీ నిలదీశారు. నిబంధనల మేరకు పనులు చేశానని ఏఈ చెప్పుకొచ్చారు. వానాకాలంలో రైతులకవసరమైన ఎరువులు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ జంగమ్మ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ ఉస్మాన్‌ఖాన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలి : ఎంపీడీవో

శంకర్‌పల్లి, జూన్ 7 : మిషన్ భగీరథ సర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మిషన్ భగరథ సర్వే యాప్ గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతీ ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ ఉందా లేదా? లేదా? ఒకవేళ ఉంటే నీళ్లు వస్తున్నాయా అనే వివరాలను యాప్‌లో పొందుపరచాలని అన్నారు. సోమవారం నుంచి సర్వే చేపట్టాలని ఆయన ఆదేశించారు.

క్రైం కార్నర్

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

యాచారం, జూన్ 7 : మండల కేంద్రం నుంచి కడ్తాల మండల కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. యాచారం మండల కేంద్రం నుంచి కడ్తాల మండల కేంద్రానికి ఆటోలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం రవాణా చేస్తుండగా పెట్రోమొబైల్ పోలీసులకు అనుమానం వచ్చింది. దాంతో వారు ఆటోను తనిఖీ చేయగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈమేరకు బియ్యం తరలిస్తున్న రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటనారాయణ తెలిపారు.

తరచూ రిపేర్‌కు వస్తుందని.. స్కూటీపై పెట్రోల్ పోసి నిప్పంటించిన యజమాని



నిప్పంటించడంతో కాలిపోతున్న స్కూటీ

చేవెళ్ల, జూన్ 7 : తన స్కూటీ తరచూ రిపేర్‌కు వస్తుందని విసిగిపోయిన యజమాని వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన చేవెళ్ల మండల పరిధిలోని కేసారం స్టేజీ సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ రఫీ పని నిమిత్తం కొడంగల్‌కు ఉదయాన్నే ఇంటి నుంచి తన స్కూటీ (టీఎస్ 07 జేఆర్ 8361)పై బయలుదేరాడు. మార్గమధ్యలో చేవెళ్ల మండల పరిధిలోని కేసారం స్టేజీ సమీపంలోని బృందావన్ కాలనీ సమీపానికి రాగానే స్కూటీ ఒక్కసారిగా నిలిచిపోయింది. దాంతో స్టార్ట్ చేద్దామని ఎంతసేపు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బైక్ మెకానిక్ పిలిపించుకుని స్కూటీని చూపించాడు. రిపేర్‌కు వచ్చిందన రూ.7వేలు ఖర్చు అవుతుందని మెకానిక్ చెప్పాడు. దాంతో విసిగిపోయిన రఫీ స్కూటీలో ఉన్న పెట్రోల్‌ను బయటకు తీసి అందరూ చూస్తుండగానే నిప్పంటించాడు. గమనించిన ఇతర వాహనదారులు దగ్గరకు వెళ్లి రఫీని విషయం అడగగా.. తన స్కూటీకి తానే నిప్పు అంటించానని సమాధానం చెప్పాడు. పలు మార్లు రిపేరింగ్ చేయిస్తే రూ.12వేల వరకు ఖర్చు అయ్యిందని, మళ్లీ ఇప్పుడు రిపేర్ చేయిద్దామంటే మరో రూ.7వేలు ఖర్చు అవుతుందని మెకానిక్ చెప్పడంతో కోపంతోనే స్కూటీని తగలబెట్టానని చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు రఫీని విచారించారు. ఇందులో ఎవరి ప్రమేయం లేదని, తానే నిప్పు అంటించినట్లు పోలీస్‌లకు వివరించాడు. కాగా పోలీసులు సైతం అతడి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు, ఎద్దు మృతి



మన్‌మర్రిలో మృతిచెందిన ఆవుల వద్ద బాధిత రైతు నర్సింహులు, పెద్దమాడ్గులలో మృతి చెందిన ఎద్దు

షాబాద్/మాడ్గుల, జూన్ 7 :విద్యుత్‌దాఘాతంతో రెండు ఆవులు, ఎద్దు మృతిచెందాయి. షాబాద్ మండల పరిధిలోని మన్‌మర్రికి చెందిన బాధితులు పొట్టిగారి నర్సింహులు తెలిపిన వివరాల మేరకు.. తన పొలం వద్ద ఆవులను మేపుతుండగా వర్షం రావడంతో వాటిని ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో మార్గమధ్యలో ఐడియా టవర్ దగ్గర కరెంట్ పోల్‌కు ఉన్న వైర్‌కు తగిలి రెండు ఆవులకు షాక్ రావడంతో అక్కడకక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని తెలిపాడు. తనకు జీవనాధారం ఆవులేనని, ప్రతీ రోజు వాటిని మేపుతూ పాలను అమ్మి జీవనం సాగిస్తున్నానని, ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం చేయాలని రైతు నర్సింహులు కోరాడు. అదేవిధంగా మాడ్గుల మండలంలోని పెద్దమాడ్గుల గ్రామానికి చెందిన జిల్లెల రాములు పొలం వద్దకు ఎడ్లబండి కట్టుకొని కూలీలను ఎక్కించుకొని పనులకు వెళ్లాడు. అనంతరం సాయంత్రం తిరుగు ప్రయాణంలో కరెంటు స్తంభం కండెన్సర్ ఊడిపోవటంతో వైరు కాడెద్దుకు తగిలింది. విద్యుత్ షాక్‌తో ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, మూడు రోజుల క్రితం కరెంటు వైరు కిందకి వేలాడుతోందని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఉపసర్పంచ్ మిద్దే రాములు సంఘటన స్థలానికి చేరుకొని రాములును పరామర్శించారు. ఎద్దు మృతికి అధికారులే కారణమని, పరిహారం కింద రూ.లక్ష అందచేయాలని ఆయన కోరారు.

బార్‌లో ఘర్షణ.. బీరు సీసాతో వ్యక్తిపై దాడి

షాద్‌నగర్ రూరల్, జూన్ 7: షాద్‌నగర్ పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం మత్తులో ఓ యువకుడిపై మరో వ్యక్తిపై బీర్ బాటిల్‌తో దాడి చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి రేటికల్ నందీశ్వర్, శివకుమార్, అనిల్‌కుమార్‌లు మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో అనిల్‌కుమార్ తన ఫోన్‌పై ఓ రాజకీయ నేత ఫొటోను కలిగి ఉండటంతో గమనించిన శివకుమార్ దానిని తొలగించాడు. దాంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మాటామాటా పెరగడంతో నందీశ్వర్ ఆగ్రహంతో లేచి అనిల్‌కుమార్ తలపై బీర్ బాటిల్‌తో కొట్టాడు. అక్కడ ఉన్నవాళ్లు సర్ది చెప్పడానికి యత్నించినా మరోసారి దాడి చేశాడు. దాంతో అనిల్‌కుమార్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆమనగల్లు, జూన్ 7: ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా దాడులు నిర్వహించినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. ఆమనగల్లు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు సంయుక్తంగా దాడులు చేశాయి. తలకొండపల్లి మండలం పాతకోట తండా, రేకుల కుంట తండా, పెద్దూరు తండా, సూర్యనాయక్ తండా, హర్యనాయక్ తండా, లక్ష్మీ తండా, కర్కస్ తండాలలో నిర్వహించిన దాడులలో నాలుగు లీటర్ల సారా సీజ్ చేసి కొర్ర రాములును అరెస్ట్ చేయగా కేతావత్ లక్ష్మణ్ పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. పాతకోట తండాలో 160 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ కేసుల్లో పట్టుబడ్డ ఇద్దరిని తలకొండపల్లి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన వానరం.. కాపాడిన యువకులు



చికిత్స చేయిస్తున్న యువకులు

కేశంపేట, జూన్ 7: మండల కేంద్రంలో శుక్రవారం ఓ వానరం(కోతి) విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన పిట్టల సాయి, ఉడుత హరికృష్ణ వానరాన్ని ఓ బ్యాక్స్‌లో పెట్టుకుని పశువైద్య కేంద్రానికి తరలించారు. అక్కడ పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత సిబ్బందితో ప్రథమ చికిత్స అందించారు. కొద్ది సేపటికి వానరంలో కదలికలు వచ్చాయి. బీటీవైఎం నాయకుడు శివాజీ సమక్షంలో వానరాన్ని సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం వానరం కోలుకుంటుందని శివాజీ తెలిపాడు.